

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తదితరులు

చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేయాలి

రాంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామన్న హామీని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీతారాములు మాట్లాడుతూ చేనేత కార్మికులు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. చేనేత సహకార సంఘాల క్యాష్, క్రెడిట్ రుణం విషయంలో సహకార సంఘాల ఎన్నికల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి: కార్పొరేటర్

అంబర్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటించి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యపై అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గతంలో ఈ ప్రాంతాన్ని సందర్శించి జలమండలి అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రదీప్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు మహేష్ ముదిరాజ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌యాదవ్‌కు పురస్కారం బహూకరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

సాలూరి సంగీతం నవరసభరితం : చంద్రకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కవి రాసిన పాటకు అనువైన సంగీత స్వరాలు కూర్చిన సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవరసభరితం అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో ప్రఖ్యాత సినీ గాయక సంగీత దర్శకుడు రాజేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎర్రగొల్ల శ్రీనివాస్‌కు సాలూరి ప్రతిభాపురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ కేంద్ర పూర్వ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారితో కలిసి పురస్కారం బహూకరించి మాట్లాడారు. సాలూరి స్వరరచన చేసిన ప్రతి పాట ఆణిముత్యం అన్నారు. శ్రీనివాస్‌యాదవ్ సాలూరి రాజేశ్వరరావు పురస్కారం అందుకోవడం విశేషమని వారిపేరు నిలపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. వేణుగోపాలచారి మాట్లాడుతూ రసమయి సంస్థ సాలూరి స్వర రచనలు ముందు తరాలకు అందించడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



బషీర్‌బాగ్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

రిజర్వేషన్లను అడ్డుకుంటున్న

రెడ్డి జాగృతిని బీసీ సమాజం క్షమించదు

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటున్న రెడ్డి జాగృతిని బీసీ సమాజం క్షమించదని బీసీ సంఘాల నేతలు అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ చౌరస్తాలో బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకుల దిష్టిబొమ్మ (రెడ్డిజాగృతి)ను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు మణిమంజరితో పాటు పలువురు దిష్టిబొమ్మను దహనం చేసి రోడ్డుపై బైఠాయించి రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 శాతం లేని అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించారని, 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీ రిజర్వేషన్లు సాధించేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ప్రధానకార్యదర్శి అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వికలాంగుల సమగ్ర అభివృద్ధికోసం ప్రత్యేక పథకం అమలుచేయాలన్నారు వికలాంగుల సంక్షేమశాఖను బలోపేతం చేయాలన్నారు. మానసిక వికలాంగుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, 21 రకాల వైకల్యాలకు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు వరమ్మ, అధ్యక్షులు వెంకట్, కోశాధికారి ఆర్. వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్టీ బోర్డు నియామకంలో అవకతవకలు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తేజస్వీగౌడ్

ముషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయ ట్రస్టీ బోర్డు నియామకంలో అవకతవకలు జరిగాయని, ఈ కమిటీని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.తేజస్వీగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహాకాళి దేవాల య ట్రస్టీబోర్డు నియామకంలో అవకతవకలు జరిగాయని హైకోర్టులో పిటీషన్ వేశామని తెలిపారు. కోర్టు తమ పిటీషన్‌ను పరిశీలించి 8 వారాల్లో కమిటీ నియామకంపై విచారణ జరిపి వివరాలు ఇవ్వాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బంతి బీజేపీ చేతుల్లోనే..

ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీ రిజర్వేషన్లను రాజకీయ క్రీడగా మార్చారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవో 9 పై రాష్ట్ర హైకోర్టు స్టే విధించడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అసెంబ్లీ పంపిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఎందుకు ఆమోదించలేదని, బీజేపీ నేతల ఒత్తిడితోనే గవర్నర్ ఆమోదించలేదని ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు.

- బాకారంలో కలుషిత నీటి సరఫరాతో రోగాలపాలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలే
- నీళ్లు కొనుక్కొని తాగుతున్నామంటున్న స్థానికులు



కలుషిత నీటి బాటిళ్లను చూపుతున్న మహిళలు

దుర్గంధం, నల్లటి రంగులో నీటిసరఫరా

కలుషిత నీటివల్ల స్థానికులు జ్వరం, చర్మవ్యాధులకు లోనవుతున్నారు. దీంతో వారు మంచినీరు కొనుక్కొని తాగుతున్నారు. తీవ్ర దుర్గంధం, నల్లటి రంగులో మంచి నీరు సరఫరా కావడంవల్ల ప్రజలు తంటాలు పడుతున్నారు.

- రాజశేఖర్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు

ఈ నీళ్లు మా కొద్దు..!

ముషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బాకారం మేదర బస్తీలో కొన్ని నెలలుగా మంచినీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బస్తీ దవాఖాన సమీపంలో ఎంతోమంది అనారోగ్యాల పాలయ్యారని తెలిపారు. ఈ విషయంపై జలమండలి ఎండీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో మంచి నీళ్లు కొనుక్కొని తాగాల్సివస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలమండలి డీజీఎంకు బీజేపీ నేతల ఫిర్యాదు

బాకారం మేదర బస్తీలో కలుషిత నీటి సరఫరాను నివారించాలని శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేష్ కుమార్, స్థానిక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కలుషిత నీటి వలన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు



జలమండలి డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కనకేష్, రాజశేఖర్

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం : వీహెచ్

నల్లకుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ బాగ్‌అంబర్‌పేటలోని వీహెచ్ నివాసానికి తరలివచ్చి ఆయన ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ మంచి పేరొందిన యువ నాయకుడు నవీన్‌యాదవ్ అని పేర్కొన్నారు. గతంలో ఆ నియోజకవర్గం నుంచి ఎంఐఎం నుంచి పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచారని ఆయన గుర్తు చేశారు. పార్టీ అధిష్ఠానానికి మూడు పేర్లను పరిశీలనకు పంపిస్తే నవీన్‌యాదవ్ పేరు ఖరారు చేసిందన్నారు. జూబ్లీహిల్స్‌లో తాను స్వయంగా ప్రచారంలో పాల్గొంటానని వీహెచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పుల్లా నారాయణ స్వామి, దిడ్డి రాంబాబు, పులి జగన్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు శ్రీమంత్‌గిరి, గడ్డం శ్రీధర్‌గౌడ్, రామ్మోహన్ రావు, శశిగౌడ్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు శాలువాకప్పి సత్కరిస్తున్న వి.హనుమంతరావు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే.. మూసీలో వేసినట్లే

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కమలం జెండా ఎగిరితీరుతుందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే అది మూసీ నదిలో వేసినట్లేనని ఆయన అభివర్ణించారు. ఆ రెండు పార్టీలు కుమ్మక్కై ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని ఆరోపించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో ఎంఐఎం నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఇప్పుడు కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారని, ఈ అభ్యర్థికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాయకులు కన్నె రమేష్ యాదవ్, శ్యాంరాజ్, నందకిషోర్‌యాదవ్, సూర్యప్రకాష్ సింగ్, బల్వీర్, నాగరాజుచారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం : ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.సోమన్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించే వారికే సమాజంలో గుర్తింపు, పార్టీలో ఆదరణ ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో ఇంటింటికి వెళ్లి గతంలో బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు స్వార్థ రాజకీయాలకోసం బీసీ రిజర్వేషన్ల పేరుతో రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, బల్లా శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ కుమార్, శంకర్‌ముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, శ్రీధర్‌చారి, సుధాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సోమన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, జైసింహా, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు లక్ష్యం

సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి

కవాడిగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నేరాల అదుపునకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు సాగాలని అప్పుడే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని సెంట్రల్ జోన్ డీసీపీ కె శిల్పవల్లి అన్నారు. నేరాలు లేని తెలంగాణను సాధించుకోవడమే పోలీసు వ్యవస్థ లక్ష్యమని ఆమె తెలి పారు. నేరాలను అదుపుచేయడానికి క్రైంను తగ్గించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డీసీపీ శిల్పవల్లి యాన్యువల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. డీసీపీ ఐదు గంటలకు పైగా పోలీస్‌స్టేషన్ తనిఖీ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన తనిఖీల్లో కేసుల వివరాలు, ఎఫ్ఐఆర్ నమోదు, పెండింగ్ కేసుల ఫైళ్లను తనిఖీ చేశారు. నేరాల ఆదుపుకు తీసుకుంటున్న చర్యలు, రౌడీషీటర్ల వివరాలు, పాతనేరస్థుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న ఆయుధాలను తనిఖీ చేశారు. కోర్టు కేసులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా, కేసు నమోదు చేసిన వారికి ఎలాంటి శిక్షలు పడ్డాయి అనే కోణంలో కూడా తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ పరిధి లో ఎక్కడ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఎందుకు జరుగుతాన్నయో అన్వేషించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై కూడా ఆమె ఆరాతీశారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులకు అందిస్తున్న సహకారాలపై కూడా ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత మూడేళ్లల్లో పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల ఏ విభాగంలో పెరాగయనే అంశపై కూడా చర్చించినట్లు ఆమె తెలిపారు. ఎస్ఐల పనితీరు పెండింగ్‌లో ఫైళ్లను కూడా తనిఖీలు చేశామని ఆమె పేర్కొన్నారు.



దోమలగూడ పీఎస్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ యాదగిరి, సీఐ ఎండి అంజద్ అలీ, తదితరులు

మహిళా కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలి

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలని రాష్ట్ర మహిళాకాంగ్రెస్ మాజీ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మహిళా కాంగ్రెస్ నేతలు కూడా ఎంతో కృషి చేశారన్నారు. సీఎం ఈ విషయంలో స్పందించి తమకు న్యాయం చేయాలని పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ కోరారు.

మైసమ్మబండలో మంచినీటి సమస్య పరిష్కరించాలి



మైసమ్మబండలో నీటి సమస్యను తెలుసుకుంటున్న బీజేపీ నేతలు

కవాడిగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని మైసమ్మ బండలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వారం రోజులుగా మైసమ్మ బండ బస్తీలో మంచీనీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం వాటర్‌వర్క్స్ ఏఈ సుప్రజ, సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థానికులు వారితో మాట్లాడుతూ, వారం రోజులుగా తమ బస్తీలో నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని, మరోవైపు డ్రైనేజీ సమస్యలతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ మాట్లాడుతూ, పైప్‌లైన్ మరమ్మతుల వల్ల నీటి సమస్యకు అంతరాయం ఏర్పడిందని సాయంత్రంలోపు మరమ్మతులు చేసి యథావిధిగా నీటి సరఫరాకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసకుంటున్నట్లు ఆమె వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుమార్‌గౌడ్, మైసమ్మ బండ బస్తీ వాసులు గిరిధర్, నర్సింగ్ పాల్గొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో శాంతిపూజ

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్‌లేన్‌లో ఉన్న శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో శుక్రవారం అమ్మవారి శాంతిపూజ నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చివరిగా శాంతిపూజ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఈసందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భవాని శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రత్యేకపూజల్లో సీనియర్‌కాంగ్రెస్ నాయకులు పాత శివకుమార్, గడ్డం రాజేష్, టీడీపీ నేతలు పలుస బాల్‌రాజ్‌గౌడ్, జంగం దశరథ్, బీజేపీ నేత గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి

రాంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందుకు రాణించాలని ప్రముఖ రచయిత్రి, టీసేజీ ఫౌండేషన్ ప్రతినిధి లలితా ఆనంద్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని బీ.ఆర్. అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది.

అంజన్నకు పార్టీలో తగిన గుర్తింపునివ్వాలి

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలోపార్టీకి అండగా నిలిచిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌కు ప్రభుత్వంలో, పార్టీలో అన్యాయం జరుగుతుందని, ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆ పార్టీ నగర మాజీ ప్రధాన కార్యదర్శి జానకి సుధాకర్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజన్‌కుమార్‌యాదవ్‌కు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా కూడా సరైన న్యాయం జరగడంలేదని తెలిపారు.

నేడు గౌతమ్‌రావు బాధ్యతల స్వీకరణ

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డా.ఎన్.గౌతమ్‌రావు శనివారం నగర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారని బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, కోశాధికారి సూర్యప్రకాష్‌సింగ్‌లు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

వ్యాపార వేత్త అదృశ్యం



కిశోర్‌కుమార్

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యాపార వేత్త అదృశ్యమయ్యాడు. అడ్మిన్ ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. బర్కత్‌పురాలోని శకుంతల సదన్‌లో ఉంటున్న కిశోర్ కుమార్ ఎ.వసంత్ (64) వ్యాపార వేత్త. ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం ఇంటినుంచి షాపుకు వెళ్లిన కిషోర్‌కుమార్ అదృశ్యమయ్యాడు. అతని సెల్‌ఫోన్ స్విచాఫ్‌లో ఉండడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం అతని కుమారుడు ధృవకె వసంత్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేష్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఇ, రామ్‌నగర్, అడిక్‌మెట్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10నుంచి 10.30 వరకు, విద్యానగర్ పరిధిలో 11నుంచి 11.30, అయ్యప్ప టెంపుల్ పరిధిలో 11నుంచి 12, పార్శిగుట్ట పరిధిలో 12నుంచి మధ్యాహం 1, ఇందిరానగర్ పరిధిలో 2నుంచి 2.30, 44 బస్టాప్ పరిధిలో 2.30నుంచి 3, హర్రాజ్‌పెంట పరిధిలో 3నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అడవి బాపిరాజు లఘు చిత్ర ప్రదర్శన

రాంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దాశరథి థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అడవి బాపిరాజు లఘు చిత్ర ప్రదర్శన జరిగింది. లఘు చిత్ర ప్రదర్శన సందర్భంగా నిర్మాత ముద్దాళి రఘురామ్, దర్శకుడు చలం, కెమెరా వెంకట్‌రావు, నటులు సుబ్బారావు తదితరులను సత్కరించారు.

ముషీరాబాద్ సెట్విన్ కేంద్ర ఇన్‌చార్జిగా సరిత

ముషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సెట్విన్ కేంద్రం ఇన్‌చార్జిగా సరిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సెట్విన్ కేంద్రంలో రెండు నెలల నుంచి ఆరు నెలల స్వల్ప కాలంలో వివిధ ఉపాధి కోర్సుల్లో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెట్విన్ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలను సైతం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9705041789 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

చిక్కడపల్లి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కార్మిక శాఖ రంగారెడ్డి జోన్ జాయింట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి జోన్ పరిధిలో గత ఏడాది మొత్తం 58వేల మంది కార్మికులను గుర్తించినట్లు తెలిపారు. 58 వేల మందిలో 49 వేల మంది వలస కార్మికులేనని మిగతా 9 వేల మంది భవననిర్మాణ కార్మికులని తెలిపారు. వలసకార్మికుల్లో కూడా అత్యధికులు భవననిర్మాణ రంగ కార్మికులే ఉన్నారని తెలిపారు. వీరిలో దాదాపు 4వేల మందికి గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేశామన్నారు. గుర్తింపు కార్డులు పొందిన కార్మికులు ప్రభుత్వంనుంచి సహాయ లబ్ధి పథకాలు పొందడానికి అర్హత పొందుతారని వివరించారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం కాచిగూడలోని కార్యాలయంలో చేయూత కార్యక్రమంలో భాగంగా నిరుపేద మహిళలకు నగదు, నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఎంత సంపాదించినా రాలేని ఆనందం పేదరికంలో మగ్గుతున్న వారికి చేయూతనందించడంలో సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొండ్లె మల్లికార్జున్, కొమిరిశెట్టి అనిల్‌కుమార్, గాదె మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా'

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ కాచిగూడ నింబోలిఅడ్డలో బీసీల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. జీవో 9 జారీలో రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా వ్యవహరించ లేదని అందువల్లే హైకోర్టు స్టే ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డులో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.